
సాక్షి కృష్ణాజిల్లా

ఆదివారం । 25 । ఫిబ్రవరి । 2024



దుర్గమ్మ సేవలో...

ఇంద్రకీలాద్రి: బెజవాడ దుర్గమ్మను తమిళ నాడు మయిలదుతురైకు చెందిన ధర్మపురం ఆధీన పీఠాధిపతి పరమాచార్య స్వామిగల్ శనివారం దర్శించుకున్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 516.60 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.



వైభవంగా వేణుగోపాలుడి కల్యాణం

కోడూరు: హంసలదీవి వేణుగోపాలుడి కల్యాణం వైభవోపేతంగా సాగింది. ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివార్ల కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

పరీక్ష కేంద్రం నిడమర్రు రోడ్డు కాదు నిడమానూరు రోడ్డు

చిలకలపూడి(మచిలీపట్నం): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్–2 సర్వీసెస్ స్క్రీనింగ్ టెస్ట్ పరీక్షకు సంబంధించి చిరునామా మార్పును గమనించాలని కలెక్టర్ పి.రాజాబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష కేంద్రం నంబరు 1112046 అభ్యర్థుల హాల్‌టికెట్లలో నిడమానూరు రోడ్డుకు బదులుగా నిడమర్రు రోడ్డు అని తప్పుగా ముద్రితమైందన్నారు. ఈ కేంద్రంలో పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు నిడమానూరు రోడ్డుగా గమనించాలని ఆయన కోరారు.

పకడ్బందీగా ఇంటర్మీడియెట్ పరీక్షలు

ఆర్ఐఓ రవికుమార్



మచిలీపట్నంటౌన్: మార్చి 1వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధం కావాలని కృష్ణాజిల్లా ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి పి.రవికుమార్ పిలుపునిచ్చారు. నగరంలోని లేడీ యాంప్తిల్ ప్రభుత్వ బాలికల కళాశాలలో శనివారం ఇంటర్మీడియెట్ పరీక్షల నిర్వహణలో పాల్గొనే చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, కస్టోడియన్ల అవగాహన సమావేశం నిర్వహించారు. ఆర్ఐఓ రవికుమార్ మాట్లాడుతూ పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవాంతరాలు ఏర్పడినా ఉపేక్షించేది లేదన్నారు. ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియెట్ మొదటిసంవత్సరం పరీక్షకు 21,348 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరం పరీక్షకు 20,161 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంటుందన్నారు. జిల్లాలోని 59 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తామని, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు నిరంతరం పర్యవేక్షిస్తాయన్నారు. విద్యార్థులు పరీక్ష సమయానికి అరగంట ముందుగానే పరీక్ష హాలుకు చేరుకునేలా ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో డీఈసీ పరీక్షల కమిటీ సభ్యులు ప్రసాదశాస్త్రి, రవికిరణ్, వెంకటరమణ, నాగరవి, కళాశాల ప్రిన్సిపాల్ ఆనందకుమార్ పాల్గొని సూచనలు ఇచ్చారు.

అసంతృప్తి జ్వాలలు

టీడీపీ, జనసేన టికెట్ల కేటాయింపు ప్రకటనతో ఆగ్రహ జ్వాలలు రగులుకున్నాయి. భుజాలు కందేలా టీడీపీ జెండాలు మోసిన తమను కాదని పారాచూట్ నాయకులకు టికెట్లు కేటాయించడంతో పలువురు నాయకులు రాజీనామాలకు సిద్ధమయ్యారు. ఇన్నాళ్లూ తమ ఇమేజ్‌ను వాడుకుని టికెట్ల వద్దకొచ్చేసరికి మొండి చేయి చూపుతారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ కోసం తాము కష్టపడితే బలంలేని జనసేనకు టికెట్లు ఇవ్వడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. జనసేన టికెట్లపై ఆశలు పెట్టుకున్నవారు సైతం అధ్యక్షా అని పిలిచే అవకాశం లేకపోయిందని నిర్వేదంలో తల్లడిల్లుతున్నారు. తమను కాదని టికెట్లు ఇచ్చారుగా.. వారు ఎలా గెలుస్తారో చూస్తామంటూ రెండు పార్టీల నాయకులు సవాళ్లు విసురుతున్నారు.



- టీడీపీ, జనసేన టికెట్ల ప్రకటనతో నిరసనల వెల్లువ
- వంగవీటి రాధాకు మొండి చెయ్యి
- టికెట్ల ప్రకటనతోకుప్పకూలిన బూరగడ్డ
- రాజీనామాకు సిద్ధమైన తిరువూరు టీడీపీ ఇన్‌చార్జి దేవదత్తు
- పెనమలూరు, మైలవరం సీట్లపై వీడని పీటముడి
- విజయవాడ వెస్ట్, అవనిగడ్డ జనసేనకు?

సాక్షి ప్రతినిధి, విజయవాడ: ఎమ్మెల్యే అభ్యర్థుల తొలిజాబితా ప్రకటన ఉమ్మడి కృష్ణా జిల్లాలో టీడీపీ, జనసేన పార్టీలను కకావికలం చేస్తోంది. ఇప్పటికే రగులుకొంటున్న పొత్తుల మంటలపై టికెట్ల కేటాయింపు మరింత అసంతృప్తికి ఆజ్యం పోసింది. దీర్ఘకాలికంగా పార్టీకి సేవ చేస్తున్న వారితో పాటు ఇటీవల పార్టీలో చేరి టికెట్లపై ఆశలు పెట్టుకున్న వారికి మొండి చెయ్యే మిగిలింది.

తిరువూరులో టీడీపీకి షాక్

తిరువూరులో టీడీపీకి షాక్ తగిలింది. టికెట్ ఆశించి భంగపడిన ఇన్‌చార్జి శావల దేవదత్తు పార్టీకి రాజీనామా చేసేందుకు సిద్ధమయ్యారు. పార్టీ నాయకులు పెద్ద ఎత్తున చేరుకుని అధినేతతో తాడోపేడో తేల్చుకోవడానికి సన్నద్ధమవుతున్నారు. కె.శ్రీనివాసరావు టికెట్ల ప్రకటన అనంతరం దేవదత్తును కలిసేందుకు ప్రయత్నించగా ఆయన ముఖంచాటేయడం టీడీపీ శ్రేణుల్లో చర్చకు దారితీసింది. ఎన్నికల సమయానికి పారాచూట్ నాయకులను తీసుకొచ్చి తమ నియోజకవర్గంపై రుద్దడం ఏమిటని తిరువూరు తెలుగుతమ్ముళ్లు మండిపడుతున్నారు.

కుప్పకూలిన బూరగడ్డ వేదవ్యాస్

పెడన టీడీపీ టికెట్‌పై గంపెడాశలు పెట్టుకున్న సీనియర్ నేత బూరగడ్డ వేదవ్యాస్ హతాశుడయ్యాడు. తనకు టికెట్ లేదని తెలియడంతో కృత్తివెన్ను మండలం చినపాండ్రాకలో ఎన్నికల ప్రచారంలో ఉన్న ఆయన ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. ఈ ఘటన జిల్లా టీడీపీలో అసంతృప్తి ఏ స్థాయిలో ఉందో తెలియజేస్తోంది.

ఆ రెండు సీట్లపై పీటముడి

మాజీ మంత్రి దేవినేని ఉమా, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, బోడే ప్రసాద్, కేశినేని చిన్ని మధ్య కుర్చీలాట కొనసాగుతోంది. నలుగురికీ ఆశపెడుతూ వస్తున్న చంద్రబాబు చివరికి తమను నట్టేట ముంచుతారని టీడీపీ తమ్ముళ్లు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. మైలవరం, పెనమలూరు సీట్లను ప్రస్తుతానికి ఎవరికీ కేటాయించకపోవడంతో ఆ నలుగురిలో టెన్షన్ కొనసాగుతోంది. చివరికి బాబుగాని, ఆయన కుటుంబ సభ్యులకు గాని సీటు కేటాయించుకుని ఆశావహులందరికీ హ్యాండ్ ఇస్తారేమోనని వారంతా లోలోన మథన పడుతున్నారు.

ఆ రెండూ జనసేనకేనా?

విజయవాడ వెస్ట్, అవనిగడ్డ సీట్లు జనసేనకు కేటాయిస్తారనేది స్పష్టమైంది. దీంతో విజయవాడ వెస్ట్‌లో రక్తంతో చంద్రబాబుపై అభిమానం చాటిన బుద్దా వెంకన్నతోపాటు జలీల్‌ఖాన్, ఎంకే బేగ్, నాగుల్ మీరా వర్గాలు అసంతృప్తితో రగిలిపోతున్నాయి. జనసేనకు టికెట్ కేటాయిస్తే పార్టీపై తిరుగుబాటు చేసేందుకు వారంతా సిద్ధమవుతున్నారు. అవనిగడ్డలో పార్టీ సీనియర్ నేత మండలి బుద్ధప్రసాద్ అయోమయంలో పడ్డారు. చంద్రబాబును నమ్ముకొని తమ కుటుంబ రాజకీయ భవిష్యత్‌ను నాశనం చేసుకున్నానని ఆయన వాపోతున్నట్లు సమాచారం. రాజకీయాలు కళ్ల ముందే మారిపోయాయని, డబ్బు కీలకంగా మారిందని, తొలి జాబితాలో తన పేరు లేకపోవడంతో పంజరంలో నుంచి బయటకు వచ్చిన పక్షిలా స్వేచ్ఛా స్వాతంత్రాలు పొందినట్లు ఉందని సోషల్ మీడియాలో పోస్టు చేశారు.

వంగవీటి రాధాకు తలుపులు క్లోజ్

విజయవాడ సెంట్రల్ టికెట్‌పై ఆశలు పెట్టుకున్న వంగవీటి రాధాకు చంద్రబాబు ముఖం చాటేశారు. ఇటీవల లోకేష్ పాదయాత్రలో రాధా ఇమేజ్‌ను వాడుకున్న ఆయన టికెట్ల కేటాయింపునకు వచ్చేసరికి చెయ్యిచ్చారు. చంద్రబాబు తీరుతో రాధా వర్గం రగిలిపోతోంది. కనీసం విజయవాడ తూర్పులో తమకు అవకాశం ఇస్తారని భావించినా అక్కడ కూడా ఆశలు ఫలించలేదు. దీంతో రాధాకు టీడీపీలో తలుపులు మూసేసినట్లే అన్నది స్పష్టమైంది. విజయవాడలో మంచి పట్టు ఉన్న వంగవీటి కుటుంబాన్ని చంద్రబాబు కూరలో కరివేపాకులా తీసిపడేశారని ఆయన అనుచరులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. విజయవాడ తూర్పులో అంబసెట్టి వాసు, బత్తిన రాములు జనసేన తరఫున టికెట్ ఆశించారు. టికెట్ల ప్రకటన వారి ఆశలపై నీళ్లు చల్లింది. మరో సారి చంద్రబాబు కాపులను మోసం చేశారని వారు మండిపడుతున్నారు. ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరిస్తున్నారు.

టికెట్ల కేటాయింపు ఇలా...

ఎన్టీఆర్ జిల్లాలో...

విజయవాడ సెంట్రల్‌లో బొండా ఉమా, విజయవాడ ఈస్ట్‌లో గద్దె రామ్మోహన్, నందిగామలో తంగిరాల సౌమ్య, జగ్గయ్యపేటలో శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), తిరువూరులో కె. శ్రీనివాసరావుకు సీట్లు కేటాయించారు. మైలవరం, విజయవాడ వెస్ట్ సీట్లను ఎవరికీ కేటాయించలేదు.

కృష్ణా జిల్లాలో...

మచిలీపట్నంలో కొల్లురవీంద్ర, గుడివాడలో వెనిగండ్ల రాము, గన్నవరంలో యార్లగడ్డ వెంకట్రావు, పెడనలో కాగిత కృష్ణప్రసాద్, పామర్రులో వర్ల కుమారరాజాకు టికెట్లు కేటాయించారు. అవనిగడ్డ, పెనమలూరు టికెట్లను పెండింగ్‌లో ఉంచారు.

27 నుంచి ఏపీ టెట్ నిర్వహణ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఏపీ టెట్–2024 ఆన్‌లైన్ పరీక్షలు ఈ నెల 27వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయని జిల్లా విద్యాశాఖాధికారి యు.వి.సుబ్బారావు తెలిపారు. పది కేంద్రాల్లో ఈ పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. విజయవాడలోని ఐయాన్ డిజిటల్ జోన్ (కానూరు), శిరీష ఇన్ఫో టెక్నాలజీస్, పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, ఎస్‌వీటీ ఇన్ఫోటెక్, శ్రీ విజయదుర్గ ఐటీ ఇన్ఫో సొల్యూషన్స్, శైలేష్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్, ఐయాన్ డిజిటల్ జోన్ (కంద్రిక), దరిపల్లి అనంత రాములు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (ఖమ్మం), సనా ఇంజినీరింగ్ కాలేజీ (కోదాడ) తదితర కేంద్రాల్లో ఈ పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ పరీక్ష జరుగుతుందని వివరించారు. పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు గంట ముందు హాజరుకావాలని సూచించారు. హాల్ టికెట్‌లో ఫొటో లేని అభ్యర్థులు లేటెస్ట్ ఫొటో, గుర్తింపు కార్డుతో (ఒరిజినల్ ఆధార్, పాన్ కార్డు, ఓటరు కార్డు, బ్యాంక్ పాస్ బుక్)తో హాజరు కావాలని సూచించారు. దరఖాస్తులో పీహెచ్‌సీ పొందుపరిచిన అభ్యర్థులు వైకల్య ధ్రువీకరణ పత్రంతో జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి అనుమతితో సహాయకుడిని పొందొచ్చని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ సందేహాల నివృత్తికి కార్యాలయ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. పర్యవేక్షకులు సూరిబాబు (94405 06411), సీనియర్ అసిస్టెంట్ జె.చంద్రహరీష్ (87902 58661)ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

క్యారమ్స్ జిల్లా జట్టు ఎంపిక



మచిలీపట్నంటౌన్: రాష్ట్రస్థాయి సీనియర్ అంతర్ జిల్లాల క్యారమ్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి కృష్ణా జిల్లా జట్టును ఎంపిక చేశారు. జట్టును ఎంపిక చేసేందుకు మచిలీపట్నంలో రెండు రోజులుగా పోటీలు నిర్వహించారు. పురుషుల జట్టుకు ఎం.బద్రి, జి.శ్రీధర్, ఎస్‌కే అబ్దుల్‌జానీ, కల్యాణ్, అచ్యుత్‌రవి, వి.ప్రసాద్, వెటరన్ పురుషుల జట్టుకు కె.అప్పారావు, వై.వి.ఆర్.ప్రసాద్ ఎంపికయ్యారు. కృష్ణాజిల్లా క్యారమ్స్ సంఘం అధ్యక్షుడు గుగ్గిళ్ల మురళీ, ఉపాధ్యక్షుడు గౌర శ్రీహరి, జిల్లా కార్యదర్శి జైపాల్‌సింగ్ ఎంపికైన క్రీడాకారులకు శనివారం జ్ఞాపికలను అందజేసి అభినందించారు. మార్చి రెండు నుంచి నాలుగో తేదీ వరకు గుంటూరులోని ఎల్‌వీఆర్ అండ్ సన్స్ క్లబ్‌లో జరిగే 51వ ఆంధ్రరాష్ట్ర సీనియర్ అంతర్‌జిల్లాల క్యారమ్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఈ క్రీడాకారులు జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని మురళీ తెలిపారు.

ర్యాండమైజేషన్ ప్రక్రియపై అవగాహన

చిలకలపూడి(మచిలీపట్నం): ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ర్యాండమైజేషన్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలని ఈవీఎంల నోడల్ అధికారి, డీపీఓ నాగేశ్వరనాయక్ సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో శనివారం ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈసందర్భంగా నాగేశ్వరనాయక్ మాట్లాడుతూ ర్యాండమైజేషన్ ప్రక్రియలో తొలుత జిల్లా ఎన్నికల అధికారి, ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలైన బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్‌లను ఆయా శాసనసభ నియోజకవర్గాలకు కేటాయిస్తారన్నారు. రెండోస్థాయి ర్యాండమైజేషన్‌లో నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు వారికి కేటాయించిన ఈవీఎంలను వారి పరిధిలోని పోలింగ్ కేంద్రాలకు కేటాయిస్తారన్నారు. ర్యాండమైజేషన్ ప్రక్రియ షెడ్యూల్‌ను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి విడుదల చేస్తారని వివరించారు. జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ, డీఆర్వో చంద్రశేఖరరావు, ఆర్డీవోలు ఎం.వాణి, దాసి రాజు, పి.పద్మావతి, ఎంయుడీఏ వీసీ పి.వెంకటరమణ పాల్గొన్నారు.

సాగరతీరం జనసంద్రం

- మాఘపౌర్ణమి (సింధు) స్నానాలకు పోటెత్తిన భక్తజనం
- హంసలదీవిలో 50వేల మందికి పైగా పుణ్యస్నానాలు
- ఉభయ తెలుగు రాష్ట్రాలు, ఇతర రాష్ట్రాల నుంచి తరలివచ్చిన పర్యాటకులు



హంసలదీవి సాగరతీరంలో భక్తుల కోలాహలం

కోడూరు: హంసలదీవి సాగరతీరం భక్త జనసంద్రంగా మారింది. ఒకవైపు సముద్రుడి అలల హోరు.. మరోవైపు భక్తజనం కేరింతలతో తీరం పులకించింది. మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని సింధుస్నానాలు ఆచరించేందుకు శనివారం పాలకాయతిప్ప బీచ్‌కు భక్తులు పెద్దసంఖ్యలో పోటెత్తారు. ఉభయ తెలుగురాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా పర్యాటకులు కుటుంబసమేతంగా తరలివచ్చి పుణ్యస్నానాలు ఆచరించారు. వేకువజాము నుంచే యాత్రికులు ప్రత్యేక వాహనాల్లో తీరానికి చేరుకుని సూర్యోదయ వేళ సింధుస్నానం చేశారు. ఉదయం 5గంటల నుంచి భక్తులను తీరానికి అనుమతివ్వగా మధ్యాహ్నం వరకు 50 వేల మందికి పైగా యాత్రికులు సింధుస్నానాలు ఆచరించారని అధికార యంత్రాంగం తెలిపింది. సాయంత్రం వరకు జనవాహిని కొనసాగింది.

బ్రహ్మముడులతో పుణ్యస్నానాలు..

మాఘపౌర్ణమి స్నానం ఆచరించేందుకు కొత్తగా వివాహమైన జంటలు పెద్దసంఖ్యలో సాగరతీరానికి తరలివచ్చాయి. వివాహ సమయంలో వేసుకున్న తలంబ్రాల దుస్తులు ధరించి వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య బ్రహ్మముడులు వేయించుకున్నారు. గుమ్మడికాయలు, పసుపు, కుంకుమ, పండ్లను నూతన దంపతులు సముద్రుడికి సమర్పించి, సంతానం కోసం ప్రార్థించారు. కొంత మంది వెండి ఉగ్గు గిన్నెలను కూడా సముద్రుడికి సమర్పించి భక్తిభావం చాటుకున్నారు.

సైకత శివలింగాలు.. దీపకాంతులు

మహిళలు తీరం ఒడ్డున సైకత శివలింగాలను తయారు చేసి వాటి చుట్టూ దీపాలను వెలిగించారు. భక్తులు వివిధ రూపాల్లో సముద్రుడికి తర్పణాలు వదిలి తమ భక్తిభావం చాటారు. యువత సముద్రంలో పిరమిడ్ విన్యాసాలు వేసి ఆకట్టుకున్నారు. చిన్నారులు ఇసుక తిన్నెలపై తమ పేర్లు రాసుకుని మురిసిపోయారు. వృద్ధులు సముద్రం ఒడ్డున ఉండే పుణ్యస్నానాలు ఆచరించారు. పండితులు సూర్య నమస్కారాలు నిర్వహించారు.

దారులన్నీ హంసలదీవి వైపే...

వేలాది వాహనాల రాకతో హంసలదీవి గ్రామ రహదారులన్నీ కిక్కిరిశాయి. సాగరానికి వెళ్లే రహదారి వెడల్పు తక్కువ కావడంతో వన్‌వే ట్రాఫిక్‌ను పోలీసులు అమలు చేశారు. పాలకాయతిప్ప నుంచి హంసలదీవి గ్రామం వరకు, దింటిమెరక రహదారిలో వాహనాలు బారులు తీరాయి. గంటల బీచ్ వద్ద కూడా అధికారులు వాహనాలను క్రమబద్ధీకరించేందుకు తీవ్రంగా శ్రమించారు. అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్, సీఐ శ్రీనిథ్ పర్యవేక్షణలో ఆరుగురు ఎస్ఐలు, 200మంది పోలీస్ సిబ్బంది పెట్రోలింగ్‌లో పాల్గొన్నారు.

నిరంతరాయంగా అధికారుల గస్తీ..

సింధుస్నానాలు ఆచరించేందుకు వచ్చే భక్తులకు ఏవిధమైన అసౌకర్యాలు కలగకుండా అధికార యంత్రాంగం తీరం వెంట నిరంతరాయంగా గస్తీ నిర్వహించింది. డీఎల్‌పీఓ జ్యోతిర్మయి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ నాగరేవతి, ఈఓ యలవర్తి సుబ్రహ్మణ్యం, వైద్య, అటవీ, మెరైన్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల పర్యవేక్షణలో భక్తులకు కావాల్సిన ఏర్పాట్లు చేశారు. అధికారులు పర్యాటకులను సముద్రంలో లోతుకు వెళ్లకుండా అప్రమత్తం చేయడంతో ఏ విధమైన అవాంఛనీయ ఘటనలు లేకుండా సింధుస్నానాలు ప్రశాంతంగా ముగిశాయి.

ఎన్నికల బందోబస్తుకు సంసిద్ధం కావాలి

జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి



కోనేరుసెంటర్(మచిలీపట్నం): సార్వత్రిక ఎన్నికలను సమర్థంగా ఎదుర్కొనేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం సంసిద్ధం కావాలని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి తెలిపారు. మచిలీపట్నం తపసిపూడి గ్రామంలోని జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రంలో జిల్లాలోని 300 మంది పోలీసు అధికారులు, సిబ్బందికి మూడు రోజుల పాటు నిర్వహించిన ఎన్నికల బందోబస్తు శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో ఎస్పీ పాల్గొన్నారు. సిబ్బందిని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో ఎన్నికలు ఎంతో ప్రతిష్టతో కూడుకున్నవన్నారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని అమలు పరచడంలో, శాంతిభద్రతలను పరిరక్షించడంలో అధికారులు, సిబ్బంది వెనకడుగు వేయాల్సిన అవసరం లేదన్నారు. గత ఎన్నికలలో జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకుని, అందుకు తగిన విధంగా ప్రణాళికలను రూపొందించుకోవాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘాను ఏర్పరచాలని తెలిపారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే వారిని గుర్తించి వారిని వల్నరాబిలిటీ మ్యాపింగ్ లో చేర్చాలన్నారు. అసాంఘిక శక్తులను అరికట్టి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు ముగిసేలా చూడవలసిన బాధ్యత ప్రతి ఒక్క పోలీస్‌పై ఉంటుందన్నారు. విధి నిర్వహణలో ఎలాంటి ఒత్తిళ్లకు, ప్రలోభాలకు తలొగ్గకుండా విలువలను పాటిస్తూ నిజాయితీగా విధులు నిర్వర్తించాలన్నారు. జిల్లాలో నేర చరిత్ర కలిగిన వారిపై, నేరాలకు అలవాటు పడిన నేరస్తులపై డెకాయిట్, రౌడీ షీట్స్ ఓపెన్ చేయాలని, వారి కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలన్నారు. గత ఎన్నికల సమయంలో గొడవలలో ఉన్న వారిని ముందస్తుగా బైండోవర్ చేయాలన్నారు. జిల్లా పరిధిలో లైసెన్స్ కలిగిన ఆయుధాల యజమానులతో మాట్లాడి సంబంధిత పోలీస్ స్టేషన్లో ఆయుధాలను డిపాజిట్ చేయించుకోవాలని ఆదేశించారు. ఎన్నికలకు కావలసిన సమాచార వ్యవస్థను మరింత బలోపేతం చేసుకోవాలని సూచించారు. జిల్లా సరిహద్దుల మీదుగా నగదు, మద్యం అక్రమ రవాణా జరగకుండా చెక్ పోస్టుల వద్ద నిఘా మరింత పటిష్ట పరచాలని ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జి.వెంకటేశ్వరరావు, డీటీసీ డీఎస్పీ రమేష్, శిక్షణ తరగతులకు హాజరైన జిల్లాలోని పోలీసు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

గ్రూప్-2 పరీక్షకు పటిష్ట బందోబస్తు : ఎస్పీ



కోనేరుసెంటర్: ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించే గ్రూప్-2 స్క్రీనింగ్ పరీక్ష జరిగే 51పరీక్షాకేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు కృష్ణాజిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి శనివారం తెలిపారు. పరీక్షకు హాజరుకానున్న అభ్యర్థులంతా నిర్ణీత సమయం కంటే ముందుగానే పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. పరీక్షా కేంద్రాలకు సమీపంలో జిరాక్స్, నెట్ సెంటర్లు, ఇతర దుకాణాలను మూసివేస్తున్నట్లు చెప్పారు. పోలీసు అధికారులు ఆయా పరీక్షా కేంద్రాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉంటారని, నిబంధనలు విస్మరించి దుకాణాలు తెరిచే వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

పెనమలూరు: గంగూరు వద్ద రోడ్డుప్రమాదంలో గాయపడి చికిత్సపొందుతూ వృద్ధురాలు మృతిచెందిన ఘటనపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ.రామారావు కథనం మేరకు గంగూరు పవర్ ఆఫీస్ కాలువకట్టపై దేవరపల్లి కుమారి(74)తన కుమారుడితో కలిసి నివసిస్తోంది. కూలీపనులకు వెళ్లి తిరిగి వస్తూ శుక్రవారం గంగూరు సబ్‌స్టేషన్ వద్ద విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి దాటుతుండగా ఆమెను కంకిపాడు వైపు నుంచి విజయవాడ వైపునకు వెళ్తున్న బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన కుమారి, విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్సపొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందింది. మృతిరాలి కుమారుడు దావీదు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష

లబ్బీపేట(విజయవాడతూర్పు): జిల్లాలో అమలవుతున్న ఆరోగ్య కార్యక్రమాలను వేగవంతం చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని వైద్యాధికారులను ఆదేశించారు. తన కార్యాలయంలో శనివారం ఆమె గ్రామీణ, పట్టణ ప్రాంత వైద్యాధికారులు, పర్యవేక్షకులు, ఏఎన్ఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఇందుమతి, ఎన్‌హెచ్ఎం డీపీయంఓ డాక్టర్ నవీన్, డాక్టర్ పద్మావతి పాల్గొన్నారు.

ఓపీ సేవల్లో రాష్ట్రంలోనే ప్రథమస్థానం

కృష్ణాజిల్లా కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడతలో ఇప్పటివరకు నిర్వహించిన క్యాంపుల్లో సరాసరి ఓపీ వైద్యసేవల్లో కృష్ణాజిల్లా రాష్ట్రంలోనే మొదటిస్థానంలో నిలిచిందని కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి శనివారం జిల్లా కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రూప్-2 సర్వీస్ స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహణ, రీ-సర్వే, జగనన్న ఆరోగ్యసురక్ష, ఉపాధి హామీ, ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణాలు తదితర అంశాలపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ రెండోవిడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలకు సంబంధించి ఇప్పటివరకు 211 క్యాంపులు నిర్వహించి 1,03,826 మందికి వైద్యపరీక్షలు చేసినట్లు చెప్పారు. ఒక్కో క్యాంపులో సరాసరి ఓపీ 492మందితో కృష్ణాజిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచిందని తెలిపారు. కంటి వెలుగు పథకం కింద జిల్లాలో 10,296 మందికి వైద్యపరీక్షలు చేసినట్లు తెలిపారు. మొదటివిడతలో 3,028మంది ఆరోగ్యశ్రీ కింద వైద్యసేవలు అందించగా వారిలో 2,035మందికి క్యాటరాక్ట్ సర్జరీలు చేయించి కళ్లజోళ్లు అందించామన్నారు. జిల్లాలో ఆదివారం నిర్వహించే గ్రూప్-2 సర్వీసెస్ స్క్రీనింగ్ పరీక్ష కోసం 51 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా, 17,241మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు వివరించారు. ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో 68 లక్షల పనిదినాలు కల్పించాలనే లక్ష్యంగా పెట్టుకోగా, 67.30 లక్షల పనిదినాలు కల్పించి 98.97శాతం లక్ష్యాన్ని సాధించామన్నారు. 11,847 కుటుంబాలకు 100 రోజుల పనిదినాలు కల్పించామన్నారు. జిల్లాలో మూడోదశ రీ-సర్వేకు సంబంధించి 131 గ్రామాల్లో ఫైనల్ ఆర్‌వోఆర్ పూర్తిచేసినట్లు తెలిపారు. 282 గ్రామ సచివాలయాల భవనాలు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటికే 203 భవనాలు, 172 ఆర్బీకే భవనాలకుగానూ 122, 123 వైఎస్సార్ హెల్త్‌క్లీనిక్ భవనాలకుగానూ 72 భవన నిర్మాణాలు పూర్తయినట్లు వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ గీతాంజలిశర్మ, ఏఎస్పీ వెంకటేశ్వరరావు, డీఆర్వో కె చంద్రశేఖరరావు, సర్వేశాఖ ఏడీ వెంకటేశ్వరరావు, డీఎంఅండ్‌హెచ్‌వో గీతాబాయి, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, పంచాయతీరాజ్ ఎస్ఈ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.



వీడియోకాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ రాజాబాబు, చిత్రంలో గీతాంజలి శర్మ, అధికారులు

గ్రూప్-2 స్క్రీనింగ్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లాలోని 54 కేంద్రాల్లో ఆదివారం నిర్వహించనున్న ఏపీపీఎస్సీ గ్రూప్-2 స్క్రీనింగ్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, సీఎస్ కేఎస్ జవహర్‌రెడ్డికి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాల అమలు పురోగతిపై శనివారం వీడియో కాన్ఫరెన్స్(వీసీ) నిర్వహించారు. ఈ వీసీకి కలెక్టర్ క్యాంపు కార్యాలయ సమావేశ మందిరం నుంచి కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, జేసీ డా.పి.సంపత్ కుమార్, వివిధశాఖల అధికారులతో కలిసి హాజరయ్యారు. ఏపీపీఎస్సీ గ్రూప్-2 స్క్రీనింగ్ పరీక్ష నిర్వహణ, జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష, అసైన్డ్ భూముల హక్కులు, నూతన ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీ, నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు తదితర అంశాలపై సీఎస్ జవహర్‌రెడ్డి సమీక్షించి వివిధ సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ గ్రూప్-2 పరీక్ష ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరుగుతుందన్నారు. జిల్లాలో 24,373మంది అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరుకానున్నట్లు చెప్పారు.ఉదయం 9.30 గంటల నుంచి 10గంటల మధ్య అభ్యర్థులు రిపోర్ట్ చేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, ఆయా కేంద్రాల పరిధిలోని జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. అభ్యర్థులు ఏవైనా సందేహాలుంటే కలెక్టరేట్ ఫోన్ నంబరు0866 2575833లో సంప్రదించాలని కోరారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ కె. శ్రీనివాసరావు, డీఎంహెచ్‌వో డా.ఎం.సుహాసిని, ఆరోగ్యశ్రీ పథకం సమన్వయకర్త డాక్టర్ జె.సుమన్, కలెక్టరేట్ డీటీ ఎం. మధుసూదన్ పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్

ఎన్ఎస్ఎస్ జిల్లా కోఆర్డినేటర్‌గా కొల్లేటి రమేష్



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్‌గా మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లేటి రమేష్ నియమితులయ్యారు. కృష్ణా యూనివర్సిటీ రిజిస్ట్రార్ శనివారం రమేష్‌కు నియామకపత్రం అందజేశారు. రమేష్‌ను కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, జిల్లా యూత్ వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీనివాసరావు అభినందించారు. ఈసందర్భంగా డాక్టర్ రమేష్ మాట్లాడుతూ కలెక్టర్ పర్యవేక్షణలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలను విజయవంతం చేస్తానని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి జిల్లా కోఆర్డినేటర్‌గా అవకాశం కల్పించిన వైస్‌చాన్స్‌లర్, యూనివర్సిటీ కోఆర్డినేటర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

బావిలో పడి తల్లీకొడుకు మృతి



మృతిచెందిన తల్లీకొడుకులు ఫాతిమూన్(27), హకీన్(3)

భీమవరం(వత్సవాయి) : వ్యవసాయ బావిలో పడి తల్లీకొడుకు మృతిచెందిన ఘటన వత్సవాయి మండలంలోని భీమవరంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ అభిమన్యు కథనం మేరకు.. గ్రామానికి చెందిన షేక్ అబ్దుల్ రహీమ్‌కి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె ఫాతిమూన్(27)కు ఏడేళ్ల కిందట తెలంగాణరాష్ట్రం సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండలం రామాపురం గ్రామానికి చెందిన వ్యక్తితో వివాహం చేశారు. వీరికి ఇద్దరు మగపిల్లలు. ఫాతిమూన్ అనారోగ్యంతో బాధపడుతూ నెల కిందట పుట్టింటికి వచ్చింది. ఇక్కడే వైద్యం చేయించుకుంటున్న ఫాతిమూన్ రెండురోజుల్లో తిరిగి అత్తగారింటికి వెళ్లాల్సి ఉంది. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం తన చిన్నకుమారుడు హకీన్(3)ను తీసుకుని బయటకు వెళ్లిన ఫాతిమూన్ తిరిగి ఇంటికి చేరకపోవడంతో కుటుంబసభ్యులు వెతకడం ప్రారంభించారు. ఈక్రమంలో గ్రామంలోని ఓవ్యవసాయబావిలో వీరి మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈఘటనపై ఎస్ఐ అభిమన్యు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆపరేషన్ వికటించి బాలిక మృతి



మంగొల్లు(వత్సవాయి): టాన్సిల్స్ ఆపరేషన్ వికటించి బాలిక మృతిచెందిన సంఘటన ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండలం మంగొల్లులో శనివారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల మేరకు.. జగ్గయ్యపేట మండలం బూదవాడ గ్రామానికి చెందిన ముప్పసాని బ్రహ్మయ్య కుమార్తె దివ్యశ్రీ(9)ట్రాన్సిల్స్‌తో ఇబ్బందిపడుతూ తన అమ్మమ్మ గ్రామమైన భీమవరం రావడంతో చికిత్సనిమిత్తం వారు మంగొల్లులోని ఓ ఆర్ఎంపీ వైద్యుడి వద్దకు తీసుకువెళ్లారు. సదరు వైద్యుడు బాలికకు మత్తుమందు ఇచ్చి ట్రాన్సిల్స్ తొలగించేందుకు యత్నిస్తుండగా తనకు నొప్పిగా ఉందని బాలిక చెప్పడంతో ఆపరేషన్‌ను నిలిపివేసి, తిరిగి కొద్దిసేపటి తర్వాత చేద్దామంటూ బయటికి వెళ్లాడు. సదరు వైద్యుడు తిరిగి వచ్చేలోగా బాలిక దివ్యశ్రీ మృతిచెందింది. అధిక మోతాదులో మత్తుమందు ఇవ్వడమే బాలిక మృతికి కారణమంటూ బంధువులు ఆరోపిస్తున్నారు. బాలిక మృతి ఘటనతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా, పోలీసులు వెంటనే స్పందించి పరిస్థితిని చక్కబెట్టారు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్ఐ బి.అభిమన్యు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రూపు తగాదాల్లో 24 మందికి జైలు

గుడివాడ టౌన్(నందివాడ): రెండువర్గాల తగాదాల్లోని 24మందికి జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించినట్లు నందివాడ ఎస్ఐ ఎన్.చంటిబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం నందివాడ మండలం గాజులపాడులో 2019 ఫిబ్రవరిలో గ్రామపెద్దల వద్ద పంచాయతీ జరుగుతున్న సమయంలో చెలరేగిన వాదోపవాదాలు ఇరువర్గాల మధ్య దాడులకు దారితీశాయి. అనంతరం ఇరువర్గాలు పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నాయి. ఈ కేసుల్లో మొదటి వర్గంలోని కోటె రాజేష్, కారే అర్జునరావు, ఓగిరాల అశోక్, ముత్యాల కృష్ణారావు, బేతపూడి నవరత్నరాజు, కోటె సంతోషం, రత్నదాసులకు రెండేళ్ల 11నెలల జైలుశిక్షతోపాటు రూ.5వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ఎ.పూర్ణిమ తీర్పు చెప్పారు. మరోవర్గంలోని జరుగుమిల్లి విల్సన్‌రాజు, ఓగిరాల శాంతరాజు, వాసేపల్లి హృదయం, జరుగుమిల్లి కల్యాణ్, జరుగుమిల్లి సందీప్, తలారి ప్రకాష్, కోటె దానియేలు, కారె దానియేలు, కారె ఏసుబాబు, కారె ఐక్రయ్య, దారం మోహనరావు, జరుగుమిల్లి బాబూరావు, జంగం సురేష్, దారం సువర్ణరాజు, జరుగుమిల్లి క్రీస్తుదాసు, మద్దాల వెంకటేశ్వరరావు, చీలి సూర్యప్రకాశరావులకు మూడేళ్ల ఒకనెల జైలుశిక్ష, రూ.5వేల జరిమానా విధించారు. కోర్టు తీర్పు అనంతరం శిక్షపడినవారిని నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ కేసును ఏపీపీలు సీలం బెంజిమన్, రాధాకృష్ణ వాదించినట్లు ఎస్ఐ చంటిబాబు వివరించారు.

